సాక్షి నిర్మల్

మంగళవారం । 25 । జూన్ । 2024



పొలాల్లో మృత్యుపాశాలు

పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు రైతులను కలవర పెడుతున్నాయి. 8లో▸



వామ్మో కుక్కలు 9లో▸

జిల్లాకేంద్రంలోని కుక్కల బెడదతీవ్రంగా ఉంది. కాలనీల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి.

గరిష్టం/కనిష్టం 34.4 /27.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

పేరుకే పెద్దాస్పత్రి!?



నిర్మల్‌లోని ప్రధాన ఆస్పత్రి

- ప్రథమ చికిత్సకే పరిమితం..
- కుక్కకాటు బాధితులు 'ప్రైవేటు'కు రెఫర్
- జిల్లా ఆస్పత్రి వైద్యుల తీరుపై విమర్శలు

నిర్మల్: సామాన్యుడికి ఆరోగ్యపరంగా ఏ కష్టమొచ్చినా ముందుగా పెద్దాస్పత్రి దిక్కే చూస్తారు. ప్రభుత్వం అన్నిరకాల ఉచిత వైద్యసదుపాయాలు అందించే ధర్మాస్పత్రి వైపే ముందడుగు వేస్తారు. ఎంతటి వారికైనా.. అత్యవసర వైద్యసేవలు అవసరమైతే మొదట తీసుకువచ్చేది ఇక్కడికే. కానీ.. అలాంటి ఆస్పత్రిలో ఇటీవల అందుతున్న సేవల తీరు విస్తుగొల్పుతోంది. పేరుకు పెద్దాస్పత్రి అయినా... ప్రథమ చికిత్సకే పరిమితం అన్నట్లుగా వ్యవహరిస్తున్న వైనం విమర్శలకు తావిస్తోంది. తాజాగా కుక్కకాటు బాధితుల విషయంలోనూ అదే జరిగింది.

పైపై చికిత్స చేసి.. ప్రైవేటుకు చేర్చి..

తరతరాలుగా సర్కారు ఆస్పత్రిపై ఉన్న ఆరోపణ ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఇక్కడ పైపై చికిత్సలు చేసి, ప్రైవేటు ఆస్పత్రికే తరలిస్తారన్న ఆరోపణలు ఇంకా ఉన్నాయి. జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చినా.. జిల్లా ఆస్పత్రి జనరల్(బోధన) ఆస్పత్రిగా మారినా.. పాతరోగం మాత్రం పోవడం లేదన్న విమర్శలు ఇప్పటికీ వస్తున్నాయి. తాజాగా ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలో కుక్కకాటుతో 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారందరినీ స్థానికులు జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ డ్యూటీలో ఉన్న వైద్యులు వెంటనే ప్రథమ చికిత్స చేశారు. కుక్కకాటుకు సంబంధించిన మందులను అందించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత కొందరు బాధితులను పలువురు వైద్యులు తమకు సంబంధం ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించడం పైనే ఆరోపణలు వస్తున్నాయి. కుక్కకాటు వంటి ఘటనల్లో ఇచ్చే మందులు చాలా ఖరీదైనవి. వీటిని ప్రైవేటులో కొనాలంటే రూ.5 వేల పైనే అవుతుంది. అలాంటి వాటిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తారు. దాదాపు ఈ చికిత్సలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేస్తుంటారు. సీరియస్ కేసులైతే ఇన్ పేషెంట్లుగా ఉంచుకుని వారికి వైద్యం అందిస్తుంటారు. తాజా ఘటనలో బాధితులంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. వారికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన చికిత్స ఇవ్వొచ్చు కానీ.. వారిలో కొందరిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఎందుకు తరలించడంపై ఆరోపణలు వస్తున్నాయి.

మెడికల్ కాలేజీ వచ్చినా..

నిర్మల్ జిల్లాగా మారినా.. జిల్లాకు మెడికల్ కాలేజీ వచ్చినా.. వైద్య సేవల్లో పెద్దగా మార్పులు కనిపించడం లేదు. ఇప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులపై పూర్తిస్థాయి నమ్మకం పెరగడం లేదన్న వాదన ఉంది. మెరుగైన వైద్యులు, ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, అనుభవం ఉన్న వైద్యసిబ్బంది ఉన్నప్పటికీ పూర్తిస్థాయి వైద్యాన్ని ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నలూ ఉన్నాయి. ఏ ఘటన జరిగినా ముందుగా జనరల్ ఆస్పత్రికి బాధితులను తీసుకురావడం, వారికి ప్రథమ చికిత్సలు అందించడం సాధారణమే. ఆ తర్వాత రెండోరోజుకే చాలామంది బాధితులు అక్కడ ఉండటం లేదు. వారంతా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

కొంతమంది తీరుతో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కొంతమంది వైద్యుల కారణంగా మొత్తం వైద్యవ్యవస్థపైన విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు కూడా చాలామంది వైద్యులు నామమాత్రంగా ఇక్కడ సేవలను అందిస్తూ.. తమ ఆస్పత్రులకే ఎక్కువ సమయాన్ని కేటాయించారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు జనరల్ ఆస్పత్రిగా మారినా.. కొంతమంది వ్యవహరిస్తున్న తీరు మళ్లీ పాతకథనే తలపిస్తోంది. పెద్దాస్పత్రికి వచ్చిన వారిని ఎలాగోలా తమకు సంబంధించిన లేదా తాము వ్యాపార భాగస్వాములుగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాలన్న తలంపుతోనే కొంతమంది వైద్యులు పనిచేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు వస్తున్నా.. పెద్దగా పట్టించుకునే వారూ లేరు.

ఆస్పత్రిలోనే చికిత్సలు..

జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పడిన తర్వాత నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నాం. జనరల్ ఆస్పత్రిలో దాదాపు అన్నిరకాల అత్యవసర సేవలూ అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటుకు సంబంధించిన మందులన్నీ చాలా ఖరీదైనవి. వాటిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తాం. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరమూ లేదు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇతర ఆస్పత్రులకు తరలించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సునీల్‌కుమార్, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్

ఎటూ తేలని 'పంచాయతీ'?



రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీ

- గ్రామాలు తరలించి రెండు నెలలు..
- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి..
- ఇబ్బందుల్లో పునరావాస కాలనీ వాసులు

కడెం: పెద్దపులి మనుగడ కోసం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీకి తరలించారు. ఊళ్లు ఖాళీ చేయించి రెండు నెలలు గడిచినా పునరావాస కాలనీకి పంచాయతీగా ప్రకటించలేదు. దీంతో స్థానిక సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పునరావాస గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని పలుమార్లు కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పునరావాస కాలనీని ప్రత్యేక పంచాయతీగా ప్రకటిస్తారా.. లేక సమీప జీపీలో విలీనం చేస్తారా అనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

జీపీ ఇబ్బందులు

గ్రామ పంచాయతీ ఖరారు కాకపోవడంతో రాంపూర్, మైసంపేట్ గ్రామాలు ఇంకా ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోనే ఉన్నాయి. పునరావాస కాలనీకి వచ్చిన వీరికి ప్రస్తుతం పక్కనే ఉన్న కొత్త మద్దిపడగ గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త మద్దిపడగ వాసులు తమ కార్మికులను కాలనీకి పంపొద్దని, జీపీ కార్మికులు అక్కడికి వెళ్లడంతో గ్రామంలో పారిశుధ్య నిర్వహణ తదితర పనులు కుంటుపడుతున్నాయని ఇటీవలే పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. రాంపూర్, మైసంపేట్ వాసులు గతంలో పాత గ్రామాల్లో వెదురు ఉత్పత్తులు తయారుచేస్తూ ఉపాధి పొందేవారు. ఇక్కడి వచ్చాక ఆ పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ ఖరారు కాకపోవడంతో ఉపాధి హామీ పనులు కూడా చేయడం లేదు.

విలీనమా, కొత్త పంచాయతీనా?

రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీలో 94 ఇళ్లు, 347 జనాభా ఉంది. పునరావాస కాలనీని మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ పంచాయతీలో కలపాలని అధికారులు భావిస్తున్నారు. అయితే పునరావాస కాలనీ వాసులకు కొత్త మద్దిపడగ గ్రామస్తులకు ఇటీవలే కంచె ఏర్పాటు విషయంలో విభేదాలు రావడంతో కొత్త మద్దిపడగ జీపీలో కలిసేందుకు కాలనీవాసులు సుముఖంగా లేరు. తమ కాలనీని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల కోడ్‌తో జాప్యం జరిగిందని, గ్రామ పంచాయతీ ఎన్నికలకు స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక జీపీగా ప్రకటించాలి..



రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలి. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశాం. మా సంప్రదాయాలు, ఆచారాలు వేరే ఉంటాయి. ఇతర జీపీలో కలపకుండా, ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేస్తేనే బాగుంటుంది.

– భీంరావు, కాలనీ వాసుడు

జీపీ ఎన్నికలకు ముందే నిర్ణయం



రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. జనాభా ప్రాతిపదికన ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలా, లేక సమీప జీపీలో విలీనం చేయాలా అనేది పంచాయతీ ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకుంటాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

న్యూస్‌రీల్

చేపల పెంపకంపై శ్రద్ధవహించాలి

- మత్స్యశాఖ ఏడీ మధుసూదన్



మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ మధుసూదన్

లోకేశ్వరం : చేపల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని నిర్మల్ మత్స్యశాఖ ఏడీ మధుసూదన్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకారులకు, వీడీసీ సభ్యులకు చెరువులు, కుంటల్లో చేపట పెంపకంపై సమావేశం ఏర్పాటు చేశారు. మధుసూదన్ మాట్లాడుతూ చెరువులు, కుంటల్లో విషపదార్థలు కలవకుండా చూడాలన్నారు. గ్రామంలోని ఉన్న కుంట వేలం ఈనెల 30లోగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సూపరింటెండెంట్ రమేశ్‌కుమార్ ఉన్నారు.

గుండెగాం, సిరాల సమస్య పరిష్కరించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రామారావుపటేల్

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో ముంపు గ్రామమైన గుండెగాం పునరావాసం, సిరాల ప్రాజెక్టు పునరుద్ధరణ, నియోజకవర్గంలోని ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం కలిసి నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏటా వర్షాకాలంలో మునిగే గుండెగాంలో ప్రజల ఇబ్బందులను వివరించారు. గత వర్షాకాలంలో సిరాల ప్రాజెక్టు తెగిన నేపథ్యంలో పునరుద్ధరణ పనులపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు, ఉపాధ్యాయ ఖాళీలు, తదితర విషయాలపై చర్చించారు. కుంటాల ఎంపీపీపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంట కుంటాల, భైంసా మండలాల బీజేపీ నాయకులు ఉన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 5,165 మంది విద్యార్థులకు 3,764 మంది ఉత్తీర్ణత సాధించగా, 1,401మంది ఫెయిల్ అయ్యారు. ఫస్ట్ ఇయర్లో మొత్తం 3,040 మంది విద్యార్థులకు 2123(58.22%) మంది పాసయ్యారు. సెకండియర్‌లో మొత్తం 1,711 మంది విద్యార్థులకు 1,206 మంది(70.49 %)పాసయ్యారు. ఫస్ట్ ఇయర్ ఒకేషనల్ కేటగిరీలో 383 మంది మంది విద్యార్థులకుగాను 244 మంది(63.71%) పాసయ్యారు. సెకండియర్‌లో మొత్తం 316 మంది విద్యార్థులకు మందికి 60.44% మంది విద్యార్థులు పాసయ్యారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించినందుకుగాను పీఆర్టీయూ తెలంగాణ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సాయన్న మాట్లాడుతూ... దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికి దక్కిందన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభించాయన్నారు. త్వరలోనే 5,500 మంది పీఎస్ హెచ్‌ఎంలు సాంక్షన్ చేయించి, ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇప్పించే బాధ్యత సంఘం తీసుకుంటుందని తెలిపారు. డీఎస్సీ- 2003 ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ ఇచ్చే బాధ్యత, కేజీబీవీలు, గురుకుల పాఠశాల సమస్యల సాధన తదితర అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షుడు శంకర్, ఉపాధ్యాయులు గంగాధరరావు, గుమ్ముల రాజేశ్వర్, శ్రీనివాస్, ఆశాకిరణ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు డీఎస్సీలో కలపాలి

- జిల్లా బీఈడీ, డీఈడీ అభ్యర్థుల సంఘం డిమాండ్
- జిల్లాకేంద్ర గ్రంథాలయ ఆవరణలో నిరసన దీక్ష



నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీలు, ప్రమోషన్లతో పాఠశాలల్లో ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను కూడా ఇటీవల విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌లోనే కలిపి పరీక్ష నిర్వహించాలని బీఈడీ అభ్యర్థుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్ర గ్రంథాలయ ఆవరణలో నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. పోస్టుల సంఖ్యను పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్‌మాట్లాడుతూ... ప్రస్తుతం చేపడుతున్న ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా జిల్లాలో ఏర్పడిన ఖాళీలు దాదాపు 50 నుంచి 300 వరకు పెరగనున్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు కూడా ప్రతీ సబ్జెక్టులో 5 నుంచి 30 వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఖాళీలన్నీ ఈ డీఎస్సీలోనే కలిపి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దాదాపు 20 వేల మెగా డీఎస్సీ హామీ నెరవేర్చే అవకాశం ప్రస్తుతం వచ్చిందన్నారు. డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ కూడా వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రేంసాగర్, గజేందర్, లక్ష్మణ్, కీర్తన, లక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మైసంపేట్, రాంపూర్ గ్రామాల పునరావాస కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కడెం మండలం కొత్తమద్దిపడగ, మైసంపేట్, రాంపూర్ పునరావాస గ్రామాల ప్రజలకు కల్పిస్తున్న వసతులపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. చేపట్టనున్న పనులకు సంబంధించిన సమాచారాన్ని శాఖల వారీగా సమీక్షించారు. పనులకు సంబంధించిన అంచనా వ్యయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా చదును చేయాలని ఆదేశించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకంలో ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని సూచించారు. గ్రామలోనే పాఠశాల, ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఇన్‌చార్జి అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీవో రత్నాకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లాలోని నిరుద్యోగ యువకులకు(పురుషులు) యంయస్ఎన్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెక్నికల్ ట్రైనీగా హైదరాబాద్‌లో పని చేయుటకు ఈనెల 26(బుధవారం)ఉద్యోగమేల నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి రాములు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగంతోపాటు ఉచిత డిగ్రీ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. మొత్తం 100 ఖాళీగా ఉన్నాయని, 18 ఏళ్ల నుంచి 20 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, టెన్త్, ఇంటర్ మెమోలు, పాస్పోర్ట్ సైజ్ ఫొటోతో బుధవారం ఉదయం 10 నుంచి 2 గంటల మధ్య ఎన్టీఆర్ మినీ స్టేడియంకు రావాలని సూచించారు. వివరాలకు 7794033306, 9441535253 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



గొర్రెలకు కట్టిన డీడీలను వెంటనే ఇప్పించాలని కోరుతున్న లబ్ధిదారులు



కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, భూ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రత్నాకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జీతం అడిగితే పనికి రావొద్దన్నారు..



నేను సోను మండలంలో మిషన్ భగీరథలో జాయింట్ ఫిట్టర్‌గా ఏడాదికాలంగా విధులు నిర్వహిస్తున్నాను. నాకు 10 నెలల జీతం ఎంపీవో కార్యాలయం నుండి రావాల్సి ఉంది. ఇదే విషయం ఎంపీవోని అడిగితే రెండు నెలల జీతం మాత్రమే ఇస్తానని అవి తీసుకుని పనికి రావొద్దని చెప్పారు.

– నరేష్, సోన్


రిజిస్ట్రేషన్ చేయడం లేదు



నా భర్త పేరు మీద నాగపూర్‌లో 1.15 గుంటల భూమి ఉంది. మా ఆయన మూడేళ్ల కింద మరణించాడు. అప్పటి నుంచి ఆయన పేరు మీద ఉన్న భూమి రిజిస్టర్ చేయించుకుందామని తహసీల్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా. మీసేవ ద్వారా కూడా దరఖాస్తు చేసుకున్నా. సంబంధిత మండల అధికారులు డబ్బులు ఖర్చు అవుతాయని, మీ పని ఇప్పుడు కాదని చెబుతున్నారు. మూడేళ్లుగా ఇలాగే తిప్పించుకుంటున్నారు.

– బోసు లస్మవ్వ, నాగపూర్, పెంబి

ఓటు వేయలేదని ఉద్యోగం తొలగించారు



నేను కొట్ల బి గ్రామంలో గత 25 ఏళ్లుగా పంపు డ్రైవర్‌గా, వీధిలైట్లు పెట్టడం, స్వచ్ఛ భారత్ సైకిల్ తొక్కడం వంటి పనులు చేశాను. 2018లో అప్పటి సర్పంచ్ నేను అతనికి ఓటు వేయలేదని విధుల నుంచి తొలగించాడు. ఇప్పటివరకు అధికారులకు ఏడుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. నాకు 10 నెల జీతం కూడా ఇవ్వాల్సి ఉంది. బకాయి జీతంతోపాటు ఉద్యోగం ఇప్పించాలి.

– రత్నాపూర్ దశరథ్, కొట్ల(బి)


డీడీలు తిరిగి ఇప్పించాలి..

కుభీర్ మండలం హల్ద గ్రామానికి చెందిన గొల్ల కుర్మలమైన మేము గతేడాది సెప్టెంబర్‌లో గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీశాము. మాకు ప్రభుత్వం నుంచి గొర్రెలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. అటు గొర్రె రాక ఇటు చేసిన అప్పులు తీరక ఇబ్బంది పడుతునానమని తెలిపారు. 45 కుటుంబాల డీడీలు తిరిగి ఇప్పించాలి.

– గొల్ల కుర్మలు, హల్ద, కుభీర్ మండలం

సామాన్యులకు అండగా పోలీసులు

- ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ టౌన్: సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం తెలియజేయాలన్నారు.

గంజాయి నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలు

జిల్లాలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకీషర్మిల పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా డే' సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి సరఫరా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి మత్తుకు అలవాటైన యువత, కార్మికులు తమ స్నేహితులతో కలిసి పట్టణ శివారు ప్రాంతంలో గంజాయి వాడుతున్నారని వారిపై నిఘా ఉంచి అడ్డుకట్ట వేయాలని సూచించారు.

పొలాల్లో మృత్యుపాశాలు

పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు రైతులను కలవర పెడుతున్నాయి. ఏటా రైతులతో పాటు మూగ జీవాలు సైతం పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో సాగు మొదలుపెడుతున్న అన్నదాతలను పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, కంచెలు లేని టాన్స్‌ఫార్మర్లు భయాందోళనకు గురిచేస్తున్నాయి.



కన్నెపెల్లి మండలం కొత్తపల్లి శివారులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద విత్తనాలు వేస్తున్న కూలీలు

- ప్రమాదకరంగా వంగిన స్తంభాలు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- విద్యుదాఘాతంతో మూగజీవాల మృత్యువాత
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో రోజూ ఎక్కడో ఒకచోట మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నా రైతులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచే వేలాది రూపాయల విలువైన కాడెడ్లు, ఆవులు, గేదెలు, మేకలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో పంటచేలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు ఒకవైపుకు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం చేనుకు వెళ్లాలంటే జంకుతున్నారు. కొన్ని గ్రామాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు గత్యంతరం లేక కర్రలను పాతి సపోర్ట్‌గా ఉంచుతున్నారు.



బెల్లంపల్లి మండలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మూడు గేదెలు (ఫైల్)

ప్రమాదభరితంగా వైర్లు

పంటచేలలో బోరుబావుల తవ్వకాలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు పెరిగాయి. ఇటీవల ప్రకృతి విలయాలు, తుపాన్ కారణంగా ఆ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇటీవలి కొన్ని ఘటనలు

- ఈ నెల 20న భీమారం మండలం కొత్తగూడెం గ్రామ సమీపంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగలడంతో బూపల్లి లచ్చన్న, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు పశువులు మృతి చెందాయి.
- ఈ నెల 18న బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ శివారులోని పంటచేలలో విద్యుత్ తీగలు తెగిపడడంతో అటుగా మేతకు వెళ్లిన మూడు గేదెలు వాటిని తాకడంతో మృతి చెందాయి.
- గత నెలలో దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి దున్నపోతు మృతి చెందింది.

సీజన్ ముందు పట్టింపేది?

ఏటా యాసంగి సీజన్ ముగిసి వానాకాలం సాగుకు ముందు మే నెలలో పంటచేలన్నీ బీడుభూములుగా ఉంటాయి. ఆ సమయంలో పొలాల్లో కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలను, వంగిన స్తంభాలను సరిచేయాల్సిన అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మేలో మరమ్మతుల పేర పదిరోజుల పాటు గ్రామాలు, పట్టణాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి కొన్నిచోట్ల మాత్రమే మరమ్మతులు చేపట్టారు. పంట పొలాలు, మైదాన ప్రాంతాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలను సరిచేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో గాలివాన బీభత్సానికి విద్యుత్ తీగలు తెగిపోవడంతో మేతకు వెళ్లిన మూగజీవాలు వాటిని తాకి మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

స్తంభాలు సరిచేయాలి

పంటచేలలో ఒకేవైపునకు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉంది. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు సరిచేయాలి. భయంతో విద్యుత్ తీగల కింద దుక్కులు దున్నలేకపోతున్నాం. వర్షాకాలం అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్ బాపు, కొత్తపల్లి, కన్నెపెల్లి మండలం

ప్రమాదాల నివారణకు చర్యలు

పంటచేలలో వంగిన స్తంభాలు, లూజుగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. కురుస్తున్న వర్షాలకు భూమి మెత్తబడి కొన్నిచోట్ల స్తంభాలు వంగిపోతున్నాయి. రైతులు ఫొటోలు తీసి పంపించడంతో వెంటనే సంబంధిత ఏఈలు వెళ్లి మరమ్మతులు చేపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రావణ్‌కుమార్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ)

దొంగలను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి



ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దుండగులు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల జిల్లాలో రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుల ఫొటోలను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. తాంసి, బేల మండలాల్లో మహిళల మెడలోనుంచి గుర్తు తెలియని దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. వారి ఫొటోలను గుర్తించడం జరిగిందని, ఎవరైనా గుర్తు పడితే సమాచారం అందించాలని కోరారు. డీఎస్పీ సెల్: 8712659914, జైనథ్ సీఐ 8712659916, ఆదిలాబాద్‌రూరల్ సీఐ 8712659915 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

పెరిగిన కడెం నీటిమట్టం



కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం రెండు అడుగులు పెరిగింది. ఈనెల 23న 673.200 అడుగులు ఉన్న ప్రాజెక్ట్ నీటిమట్టం సోమవారం 675.300 అడుగులకు చేరిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే సతీమణి అస్థికల నిమజ్జనం



పిండ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

బాసర: చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణి రూప అస్థికలను సోమవారం నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే సతీ మణి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలి సిందే. కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పిండప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాసర పీఏసీఎస్ డైరెక్టర్ మమ్మాయి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టుపెట్టిన ఒకరి అరెస్ట్

భైంసాటౌన్: ఒక వర్గం మనోభావాలు దెబ్బతినేలా ఫొటో ఎడిట్ చేసి సామాజిక మాధ్యమంలో పోస్టుపెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సోమవారం తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో స్టేటస్ పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే సదరు ఎడిట్ ఫొటోను పలువురు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని, అలాంటి చర్యలు మానుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వన్యప్రాణిని వేటాడిన ఒకరిపై కేసు

భైంసాటౌన్: వన్యప్రాణిని వేటాడి చంపిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు భైంసా అటవీ శాఖ రేంజ్ అధికారి రమేశ్ రాథోడ్ తెలిపారు. కుభీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన భుజంగ్ రెండురోజుల క్రితం ఉడుమును వేటాడి తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సోమవారం గ్రామంలోని భుజంగ్ ఇంటికి వెళ్లి ఆరా తీయగా అప్పటికే ఆ ప్రాణిని చంపినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని భైంసాలోని రేంజ్ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. వన్యప్రాణులకు హాని కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌వో హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్‌వో ఇర్ఫానుద్దీన్, బీట్ అధికారులు లెనిన్, హరిలత, తదితరులు ఉన్నారు.

నాటుసారా తయారీదారుడికి జరిమానా

ఇచ్చోడ: నాటుసారా తయారు చేస్తున్న ఒకరికి రూ.70 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోథ్ మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామానికి చెందిన జాదవ్ రమేశ్ నాటుసారా తయారు చేస్తుండగా పలుమార్లు ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. కేసులు నమోదు చేసినప్పటికీ నాటుసారా తయారీ మానక పోవడంతో ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు రూ.70 వేల జరిమానా విధించారు.

ఇరువురిపై దాడి కేసు నమోదు

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్నకు అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రెండేళ్లుగా భూతగాదాలు ఉన్నాయి. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం భోజన్న చేనుకు వెళ్లగా అప్పటికే లక్ష్మణ్, అతని భార్య గోదావరి అక్కడ ఉన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా లక్ష్మణ్ చేతిలో ఉన్న పారతో భోజన్న తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ముధోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్సై మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్ష్మణ్, గోదావరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వద్దనుకున్నా.. పదోన్నతులు!

- వెబ్‌ఆప్షన్ ఇవ్వకున్నా టీచర్లకు ప్రమోషన్
- విద్యాశాఖలో అధికారుల తీరిదీ

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖ తప్పిదంతో పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న కొంత మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగింది. ఎస్జీటీ పదోన్నతుల్లో భాగంగా జిల్లాలో 420 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు లభించాయి. అయితే పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో ప్రక్రియ నిర్వహించారు. సాంకేతిక, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల తప్పిదం కారణంగా పదోన్నతులు పొందాల్సిన కొంత మంది టీచర్లు ప్రమోషన్‌కు దూరమయ్యారు. జిల్లాలో 51 మంది ఎస్జీటీలు పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాలో ఉన్నారు. అయితే వారు తమకు పదోన్నతి వద్దని సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోలేదు. వెబ్ ఆప్షన్లు సైతం పెట్టుకోలేదు. అయినప్పటికీ వారికి పీఎస్ హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించారు. వీరి నుంచి నాట్ విల్లింగ్ తీసుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ప్రస్తుతం ఈ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వారికి లభించిన పదోన్నతి స్థానంలో విధుల్లో చేరడం లేదు. దీంతో ఆ పాఠశాలల్లో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. అలాగే మరో 20మంది ఉపాధ్యాయులు రెండు సబ్జెక్టుల్లో పదోన్నతులు లభించడంతో ఒక్క పోస్టులో చేరారు. మరో పోస్టులో చేరకపోవడంతో మరో 20 మంది ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు నష్టం జరుగుతుంది. మావల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీగా పనిచేస్తున్న హీరాబాయి పదోన్నతి కోసం సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోలేదు. విద్యాశాఖ సిబ్బంది పదోన్నతి తీసుకుంటారా అనే విషయాన్ని అడగగా, తాను తీసుకోనని స్పష్టం చేశారు. వెబ్ ఆప్షన్ కూడా పెట్టుకోలేదు. అయినప్పటికీ ఆమెకు తలమడుగు మండల కేంద్రంలో పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతి కల్పించారు. కానీ ఆమె పదోన్నతి తీసుకునేందుకు నిరాకరించారు. ఇలాంటి వారు జిల్లాలో 71 మంది వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

గుట్కా రూపుమాపడమే లక్ష్యం

- ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గుట్కా రూపుమాపడమే లక్ష్యమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని డైమండ్ ట్రాన్స్‌పోర్ట్ గోదాంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా రూ.41,31,500 విలువైన గుట్కా లభించినట్లు తెలిపారు. గుట్కా వ్యాపారం నిర్వహిస్తున్న ఖానాపూర్‌కు చెందిన షేక్ రహెమతుల్లా, అస్లమ్ ట్రేడర్స్ యజమాని అర్బాజ్‌ఖాన్, సైఫుల్లా ఖాన్, షమీఉల్లాఖాన్, ఫసీ ఉల్లాఖాన్, సాజిదుల్లాఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గోదాం నుంచి దరివల్ టొబాకో, అన్వర్ టొబాకో, ఆర్ఎల్ఎక్సెల్, 999 షార్ట్, యూకో, తోటా, జేకే టొబాకో తదితర 20 రకాల టొబాకోను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ దాడులు నిరంతరంగా కొనసాగుతాయన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్న కాంబ్లె బాలాజీ (50) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, వార్డెన్ అనిత సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.20 వేల నగదు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఐటీడీఏ అధికారులు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరు మృతి



మోహన్(ఫైల్)

భైంసాటౌన్: లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన పట్టణంలోని భోకర్ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ కథనం ప్రకారం.. దేగాం గ్రామానికి చెందిన చెట్టుకింది మోహన్(35) ఆదివారం రాత్రి బైక్‌పై భైంసా నుంచి దేగాంకు వెళ్తుండగా భోకర్ చౌరస్తా సమీపంలో గుర్తు తెలియని లారీ ఎదురుగా ఢీకొట్టింది. మోహన్‌కు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుని సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

కుంటాల: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓలా గ్రామానికి చెందిన బొమ్మెన ప్రకాష్ (36) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య బొమ్మెన రీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రశాంత్ పని నిమిత్తం ఆటోలో స్థానిక మంజులాపూర్ వెళ్లి వస్తుండగా ఈద్గాం చౌరస్తా సమీపంలో కారు ఢీకొట్టింది. ఆటో పూర్తిగా దెబ్బ తినడంతో పాటు ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. నేరడిగొండ మండలం బుగ్గారాంకు చెందిన స్వాతి అటవీహక్కు పత్రంపై పేరు మార్చాలని, ఇంద్రవెల్లి మండలం మర్కగూడకు చెందిన భీంరావు కిరాణా దుకాణం మంజూరు చేయించాలని, ఉట్నూర్‌కు చెందిన శశిరేఖ గురుకుల పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని, నేరడిగొండ మండలం చించోలికి చెందిన సూర్యమణి రుణం ఇప్పించాలని కోరారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్, అదనపు వైద్యాధికారి బాలు, ఆర్సీవో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

టేకుచెట్లు నరికిన వ్యక్తికి జైలు

కడెం: మండలంలోని అల్లంపల్లి గ్రామ శివారులో పోడు వ్యవసాయం కోసం టేకు చెట్లను నరికిన అదే గ్రామానికి చెందిన కోమటి చిన్నయ్య కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ పేర్కొన్నారు. 14 రోజుల జైలు శిక్ష విధించడంతో సోమవారం నిందితుడిని జిల్లా కేంద్రంలోని సబ్ జైలుకు తరలించారు.

రహదారిపై డీసీఎం బోల్తా

కడెం: మండలంలోని ఉడుంపూర్ సమీపంలో గండిపోచమ్మ ఆలయం వద్ద రహదారిపై సోమవారం అదుపుతప్పి డీసీఎం బోల్తా పడింది. రహదారికి అడ్డంగా పడిపోవడంతో ఉట్నూర్–జన్నారం, కడెం మధ్య వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంట పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై నిరీక్షించారు. అనంతరం ప్రయాణికులే డీసీఎం పక్క నుంచి తాత్కాలిక దారి చేయడంతో వాహనాల రాకపోకలు సాగాయి. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నేరడిగొండ: మండలంలోని గాజిలి గ్రామానికి చెందిన పెందూర్ మహేష్ (19) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలో గల అడవిలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు వెళ్లి చూడగా శవం కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతదేహంపై ఉన్న బట్టలను చూసిన గ్రామస్తులు పెందూర్ మహేష్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారం క్రితం బోథ్ మండలం సాంగ్విపల్లెలో ఉన్న తన మేనమామ ఇంటికి విత్తనాలు వేసేందుకు వెళ్లినట్లు మృతుని తల్లి జైతుబాయి తెలిపింది. మృతికి మేనమామలు యాదవ్‌రావు, లక్ష్మణ్ కారణమని ఆరోపించింది. వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ఐటీడీఏ ఎదుట ఆదివాసీల ధర్నా



ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ఆదివాసీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, షెడ్యూల్ ప్రాంతంలో మెగా డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని, పోడుభూములు సాగుచేసుకుంటున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 5 వ షెడ్యూల్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రంలోనైనా ఆదివాసీలకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్న తమకు అన్ని విభాగాల్లో అసంతృప్తి ఎదురవుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాకు అందజేశారు. పీవో మాట్లాడుతూ ఐటీడీఏ మీదేనని, ఏ సమస్య ఉన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తనతో సాధ్యమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆదివాసీలు, సంఘాల నాయకులు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బుర్ర పోచ్చయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, నాయకులు తిరుపతి, కుమ్ర శ్యాంరావు, నగేశ్, జంగు, విజయ్, గోపీచంద్, రేణుక, పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేస్తున్నాడని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీపై కేబినెట్ ఆమోదం తెలపడంతో సోమవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రభుత్వ బడులకు పూర్వవైభవం తెస్తాం

ప్రభుత్వ బడులకు పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బడిలో ఆంగ్లమాధ్యమంతో పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రోడ్డు వైడెనింగ్ పనుల్లో పాఠశాల స్థలం పోయినప్పటికీ విద్యార్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా తరగతులు నిర్వహిస్తామన్నారు. దీనిపై తల్లిదండ్రులు అధైర్యపడవద్దన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైతే వీవీలను నియమిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ' కేసులో నిందితుల బెయిల్ రద్దు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ విత్తన కేసులో ప్రధాన నిందితుల బెయిల్‌ను జిల్లా జడ్జి రద్దు చేశారని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గతనెల 25న ఆదిలాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తున నకిలీ విత్తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పి రైతులను మోసగించే ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 500 కేజీల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.19లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా సెషన్స్ కోర్టులో రివిజన్ ఫైల్ చేశామని, వాదనలు విన్న జిల్లా జడ్జి ప్రభాకర రావు వారి బెయిల్‌ను రద్దు చేసి మూడు రోజుల్లో లొంగిపోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకుగానూ సోమవారం సామ అశోక్ రెడ్డి, రాజేందర్ మున్సిఫ్ కోర్టులో లొంగిపోగా కోర్టు 14 రోజుల జూడీషియల్ రిమాండ్ కస్టడీ విధించడంతో జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని జాల్నా, కర్ణాటక, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో గల వీరి కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తూ విచారించేందుకు జిల్లా పోలీసుల తరఫున ప్రధాన నిందితులను పది రోజులు పోలీసు కస్టడీ కోరడం జరిగిందన్నారు. నేరానికి పాల్పడిన నిందితులకు ఆశ్రయం ఇచ్చిన షాపు ఓనర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. గోదాంను తహసీల్దార్ సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు.

లారీని ఢీకొట్టి ఇద్దరు మృతి



చుంచు సురేష్ (ఫైల్)



పెద్ద సాయన్న (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన చుంచు సురేష్ (30), లక్ష్మణచాంద మండలంలోని పార్పెల్లికి చెందిన పెద్ద సాయన్న (50) బైక్‌పై వచ్చి తిరుగు ప్రయాణంలో ఆగి ఉన్న లారీని వెనక నుండి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను బోథ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.